ఐడీడీఎంపీ సీట్లకు డిమాండ్

- జేఎన్‌టీయూలో ముగిసిన కౌన్సెలింగ్
- ఎంసెట్ అభ్యర్థుల కన్నా జేఈఈ ర్యాంకర్లే అధికంగా మొగ్గు
- బ్రాండ్ వాల్యూతో అభ్యర్థుల్లో యమ క్రేజ్: డైరెక్టర్



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న అభ్యర్థులు, అధికారులు

హైదరాబాద్‌సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ ప్రోగ్రాం (ఐడీడీఎంపీ)కు అనూహ్య స్పందన లభించింది. సోమవారం యూనివర్సిటీ అడ్మిషన్ విభాగంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు పోటెత్తారు. మొత్తం నాలుగు కోర్సుల్లో 80 సీట్లకు 299 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, కౌన్సెలింగ్ కోసమని తల్లిదండ్రులు కూడా అభ్యర్థుల వెంటరావడంతో క్యాంపస్ కిటకిటలాడింది. ఐదేళ్లలో జేఎన్‌టీయూ బీటెక్, స్వీడన్‌లో ఎంఎస్ పూర్తి చేసుకునే అవకాశం ఉండడమే ఈ డిమాండ్‌కు కారణంగా తెలుస్తోంది. స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటీహెచ్)తో చేసుకున్న అవగాహన ఒప్పందం (ఎంఓయూ) మేరకు ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ మాస్టర్స్ ప్రోగ్రాం (ఐడీడీఎంపీ)ను జేఎన్‌టీయూ పదేళ్లుగా నిర్వహిస్తోంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఈసీఈ కోర్సుల్లో 20 సీట్ల చొప్పున మొత్తం 80 సీట్లుండగా, వీటిలో 30 శాతం సీట్లు జేఈఈ ర్యాంకర్లతో, 70 శాతం సీట్లు ఎంసెట్ ర్యాంకర్లతో భర్తీ చేశారు. ఐదేళ్ల ఐడీడీఎంపీ కోర్సుల్లో చేరే విద్యార్థులు మూడున్నరేళ్ల పాటు జేఎన్‌టీయూలో, ఏడాదిన్నర పాటు స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటీహెచ్) యూనివర్సిటీలో చదువుకోవాల్సి ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ వలన విదేశాల్లో ఎంఎస్ చేయాలనుకునే విద్యార్థులకు ఏడాది సమయం ఆదా అవుతుంది. అలాగే, బీటెక్ తరవాత విదేశాల్లో ఎంఎస్ చేసేందుకు అయ్యే ఖర్చుతో పోల్చితే అతితక్కువ వ్యయంతో స్వీడన్‌లో ఎంఎస్‌ను పూర్తిచేసేందుకు వీలవుతుందని అధికారులు తెలిపారు. ఐడీడీఎంపీ కోర్సు పూర్తిచేసిన వారికి స్వీడన్‌లో ఉద్యోగం చేసేందుకు వీలుగా బీటీహెచ్ యూనివర్సిటీ నుంచి ఎంఎస్ సర్టిఫికెట్ ఇస్తుండగా, ఇండియాకు వచ్చి ఉద్యోగం చేయాలనుకునే వారికి జేఎన్టీయూ నుంచి బీటెక్‌తో పాటు ఎంటెక్ సర్టిఫికెట్ కూడా అందిస్తుండడం విశేషం.

● జేఎన్‌టీయూ బ్రాండ్‌తో అభ్యర్థుల్లో క్రేజ్

జేఎన్‌టీయూకు ఉన్న బ్రాండ్ వాల్యూ అభ్యర్థులను, వారి తల్లిదండ్రులను విశేషంగా ఆకర్షిస్తోందని అడ్మిషన్స్ డైరెక్టర్ జి.కృష్ణమోహనరావు తెలిపారు. ఈ క్రమంలోనే ఐడీడీఎంపీ ప్రోగామ్ సీట్లకు గతంలో ఎన్నడూ లేనంతగా డిమాండ్ పెరిగిందన్నారు. ఎంసెట్ అభ్యర్థులకన్నా జేఈఈ అభ్యర్థులే ఎక్కువగా ఈ కోర్సుల పట్ల మొగ్గుచూపారని, ప్రత్యేకించి కొందరు అభ్యర్థుతలు కంప్యూటర్స్ కన్నా ఈసీఈ కోర్సుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారని వెల్లడించారు. ఎంసెట్ కేటగిరీలో మొదటి సీటు 6వేల ర్యాంక్ అభ్యర్థి తీసుకున్నారని, 4లక్షల లోపు జేఈఈ ర్యాంకు అభ్యర్థులతో సీట్లన్నీ భర్తీ అయినట్లు చెప్పారు. కౌన్సెలింగ్ ప్రక్రియను రెక్టార్ విజయకుమార్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో అడ్మిషన్ల విభాగం డిప్యూటి డైరెక్టర్ సైదానాయక్, స్వీడన్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అఫైర్స్ డైరెక్టర్ గురుదత్, కోఆర్డినేటర్ ఫణిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి గాగిల్లాపూర్‌లో ప్రభుత్వ భూమి కబ్జా



నిర్మాణం చేసిన గదులు, బేస్‌మెంట్లు

దుండిగల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): గండిమైసమ్మ, దుండిగల్ మండలం పరిధి చర్చి గాగిల్లాపూర్‌లోని సర్వేనెం. 214లో గల ప్రభుత్వ భూమి డబుల్ బెడ్‌రూమ్ ప్రక్కన దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే 30 గుంటల ప్రభుత్వ భూమిని సూరారం ప్రాంతానికి చెందిన కొందరు కబ్జాలకు పాల్పడుతూ అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. ఆ భూమికి ముందు భాగంలో రెండు గదుల నిర్మాణం చేశారు. మిగతా స్థలంలో 5 నుంచి 7 వరకు బేసిమెంట్లు నిర్మించారు. ఈ అక్రమ నిర్మాణాల విషయం గండిమైసమ్మ, దుండిగల్ రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చినా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సర్వే నెంబరు 214లో కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమి కనుమరుగైనా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

డ్రగ్స్ రహిత తెలంగాణాలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



ఏసీపీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న నరేష్

హైదర్‌నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత తెలంగాణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కూకట్‌పల్లిలోని అశోకగార్డెన్స్‌లో నిర్వహించిన ప్రైవేటు డిగ్రీ కాలేజీ యానివల్‌డే సెలబ్రేషన్స్‌కు ఏసీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా విద్యార్థులు డ్రగ్స్ సేవిస్తే వారిపట్ల పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులతో డ్రగ్స్ రహిత తెలంగాణలో భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ముత్తు, కళాశాల డైరెక్టర్ లావణ్య, ఆర్గనైజ్ డీన్ మౌనిక, ప్రిన్సిపాల్ బీఎస్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ భాగ్య పాల్గొన్నారు.



కరాటే విద్యార్థులతో హీరో సుమన్

శారీరక దారుఢ్యానికి కరాటే: సుమన్

గాజులరామారం, జూలై 15(ఆంధ్రజ్యోతి): శారీరక దారుఢ్యానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని సినీనటుడు, హీరో సుమన్ అన్నారు. గాజులరామారం డివిజన్ మహాదేవపురంలో టైక మార్షల్ ఆర్ట్స్ అకాడమీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు, క్రమశిక్షణకు పిల్లలకు ఆరోగ్యానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కరాటేలో ప్రతిభను కనబరిచిన పిల్లలకు బహుమతులను అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు



పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

భెల్‌కాలనీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం.. స్వాతినక్షత్రం సందర్భంగా సోమవారం లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో ప్రధాన అర్చకుడు భార్గవ్ ఆధ్వర్యంలో నృసింహస్వామికి విశేష పంచామృతాభిషేకం, అర్చనలు ఘనంగా నిర్వహించారు. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర-యోగేశ్వరస్వామి దేవస్థానంలోని లక్ష్మీనరసింహస్వామి అంతరాలయంలో ఉదయం 108 సుగంధ నదీజాలలతో కూడిన ద్రవ్యాలు, మధు, ఫలరసాలతో అభిషేకం నిర్వహించారు. వేదోక్త మహా పంచామృతాభిషేకం, తామర పువ్వులతో పుష్పార్చన, సుదర్శనసహిత లక్ష్మీనరసింహహోమం, కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.

దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

హైదర్‌నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ పోచమ్మ దేవాలయానికి స్లాబ్ నిర్మాణం కోసం ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సయ్యద్, జి.రవి, అగ్రవాసు, సంగమేష్, బాలస్వామి, రవీందర్, అజామ్, నరసింగ్, శ్రీనివాస్, మనోహర్, పరశురాం, బాబు, దేవా, రాజయ్య, చక్రధర్, అరుణ, దేవి, బుజమ్మ పాల్గొన్నారు.

● రూ.51 వేల విరాళం

పేట్‌బషీరాబాద్: కొంపల్లి పురపాలక సంఘంలోని రాయల్ పార్కులో నిర్మిస్తున్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి బీజేపీ మేడ్చల్ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి పి.సతీష్‌సాగర్ రూ.51 వేల నగదు సంఘం సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, అధ్యక్షుడు చంద్రమౌళి, వెంకట్‌నారాయణ, శంకరాచారి, కృష్ణాచారి పాల్గొన్నారు.

యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా చంద్రకాంత్



చంద్రకాంత్

షాపూర్‌నగర్, జూలై15(ఆంధ్రజ్యోతి): యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రకాంత్ సోమవారం నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశంలో 52 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 18 మంది ఆఫీస్ బేరర్స్, 32 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడుగా తాడికొండ రవి, కార్యదర్శిగా తిరుపతిని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యుడిగా ఎన్నికైన చంద్రకాంత్ మాట్లాడుతూ.. యూఎస్ఎఫ్ఐలోకి రావడం ఆనందంగా ఉందని, కమిటీలోకి స్వాగతించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసిన నాగిరెడ్డి

ఫతేనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ పుట్టిన రోజు వేడుకలు ఫతేనగర్ డివిజన్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పటోళ్ల నాగిరెడ్డి ఆధ్వర్యంలో భరత్‌నగర్ స్కూల్ విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కొండాల్‌రెడ్డి, తూము మనోజ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా కన్వీనర్ సంతోష్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు అశోక్‌ముదిరాజ్, ఎండి మక్బూల్, రవీందర్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య లీడర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి



నినాదాలు చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

బాలానగర్,జూలై 15(ఆంధ్ర జ్యోతి): ఇరవై ఏళ్ల నుంచి పొదుపు సంఘాలను నడుపుతూ సకాలంలో వాయిదాలు చెల్లిస్తున్న మహిళా సమాఖ్య లీడర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందజేయాలని సీఐటీయూ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. సోమవారం బాలానగర్ చెరబండరాజుకాలనీ కమ్యూనిటీ హాలులో సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయక కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సమావేశానికి సంఘం సభ్యులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా సమాఖ్య సభ్యులు, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. 20 ఏళ్ల నుంచి వేతనం లేకుండా వెట్టి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ కష్టాన్ని సేవలను గుర్తించి తమకు గౌరవ వేతనాన్ని అందజేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ మహిళా నాయకురాలు విజయ, సమాఖ్య లీడర్లు గణిక, దేవీ, సంతోషి, స్వరూప, లావణ్య, అనంతలక్ష్మి, సరస్వతీ, యోగేశ్వరి, భాగ్యలక్ష్మి, లత, కవిత, అన్నపూర్ణ, శ్రీదేవి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఆర్టీసీ డీఎం బదిలీ

ఫతేనగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఎంగా పని చేసిన మహమూద్‌బిన్ ఇసాక్ మెదక్ సంగారెడ్డి ఏటీఎం కార్గోకు బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో దిల్‌సుఖ్‌నగర్ డిపో డీఎంగా పని చేస్తున్న డి.హరి కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోకు బదిలీపై రానున్నారు. . డీఎంతో పాటు డిపోలో పని చేసిన ఎస్‌టీఐ(సేఫ్టీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్) కే.వెంకటేశ్వర్లు, మియాపూర్-2 డిపోకు బదిలీ కాగా అతడి స్థానంలో మియాపూర్-2 డిపోలో ఎస్‌టీఐ విధులు నిర్వహిస్తున్న మల్లేషం కూకట్‌పల్లి డిపోకు బదిలీపై వచ్చారు. దిల్‌సుఖ్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్న హరి బుధవారం కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. కేపీ డిపోలో పని చేసి బదిలీపై వెళుతున్న ఇసాక్‌కు బుధవారం డిపోలో వీడ్కోలు కార్యక్రమాన్ని డిపో ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.



● బల్కంపేటలో ఎమ్మెల్యే పూజలు

బల్కంపేటలోని ఎల్లమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ సోమవారం దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

\- కూకట్‌పల్లి, ఆంధ్రజ్యోతి

బీహెచ్‌ఈఎల్‌ను సందర్శించిన ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు



భెల్ ఉన్నతాధికారులతో కలిసి మొక్కలు నాటుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్

భెల్‌కాలనీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ సోమవారం బీహెచ్‌ఈఎల్ పరిశ్రమను సందర్శించారు. దేశంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో అమలుపరుస్తున్న రిజర్వేషన్‌లు, కల్పిస్తున్న సౌకర్యాలపై అధ్యయనం చేస్తూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పర్యటనల్లో భాగంగా సోమవారం బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలో పర్యటించారు. కమిషన్ సభ్యుడికి భెల్ హెచ్‌పీఈపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెబీ.రాజా, జీఎం హెచ్‌ఆర్ శ్రీనివాసరావులు ఘన స్వాగతం పలకగా, సీఐఎస్ఎఫ్ జవాన్లచే గౌరవ వందనం నిర్వహించారు. కాలనీలో గల అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పరిశ్రమలో పర్యటించి, ఉత్పత్తి కేంద్రాలను సందర్శించారు. ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రతేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, అసోసియేషన్లసభ్యులు, ఉన్నతాధికారులు కమిషన్ సభ్యుడిని సన్మానించారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోరెందుకు?

ప్రజావాణిలో ఉపకమిషనర్‌కు బీజేపీ, కాంగ్రెస్ నేతల ఫిర్యాదు



డీసీకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేత ఆకుల సతీష్

కుత్బుల్లాపూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ జంటసర్కిళ్ల పరిధిలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు కబ్జా అవుతున్నా, అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఉపకమిషనర్‌కు వినతిపత్రాలు సోమవారం అందజేశారు. చింతల్‌లో ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా ఈవీ సాగర్‌రావు మరో కొందరు వ్యక్తులు రేకులతో షెడ్‌లు నిర్మిస్తున్నారని, అతడిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సాయిబాబాపై కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీ.లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గాజులరామారం, సూరారం, జీడిమెట్ల ప్రాంతాల్లోని లింగంచెరువు, ఫాక్స్‌సాగర్, చిన్నబంధంచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో బహుళ అంతస్తులు నిర్మిస్తున్న వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు ఎందుకని పశ్నించారు. రామిరెడ్డినగర్, భాగ్యలక్ష్మీకాలనీలలో కబ్జాలను ఆపాలని కోరారు. డీసీలు వి.నర్సింహ, మల్లారెడ్డి, ఏసీపీ సాయిబాబా, ఈఈ లక్ష్మీగణేష్ పాల్గొన్నారు.

● ఆరు ఫిర్యాదులు

పేట్‌బషీరాబాద్: రంగారెడ్డినగర్ డివిజన్‌లోని కుత్బుల్లాపూర్ జల మండలి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆరు ఫిర్యాదులు అధికారులు స్వీకరించారు. ముగ్దుంనగర్‌లో మంచినీటి పైప్‌లైన్ సామర్థ్యాన్ని పెంచాలని, పద్మానగర్‌లో తాగునీటి సమస్యలపై అధికారులకు ఆయా కాలనీల ప్రజలు ఫిర్యాదు చేశారు.

● ప్రభుత్వ భూములను కాపాడాలి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ ఎర్రకుంట చెరువులో కొనసాగుతున్న ఆక్రమణలపై, అదే విధంగా సర్వేనెంబరు. 233/13లో ప్రభుత్వ భూమి ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా నిజాంపేట్‌లో సర్వేనెంబరు 325లో 11 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాయ క్రాంతమైందని కలెక్టర్‌కు వివరించారు. ఆ భూములను కాపాడి ప్రజావసరాలకు ఉపయోగపడే విధంగా చూడాలన్నారు.

3.8 కేజీల గంజాయి స్వాధీనం

ఒకరి అరెస్ట్.. పరారీలో ఇద్దరు

దుండిగల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో దుండిగల్ ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పోలీసులు వీరి నుంచి 3.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఒడిస్సాకు చెందిన శుభ కంతజన(30) బతుకుదెరువు కోసం రెండేళ్ల క్రితం వలస వచ్చి గాగిల్లాపూర్‌లోని అద్దె ఇంట్లో నివాసం ఉంటూ, సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఇటీవల ఒడిస్సాలోని తన మిత్రుడు జిల్లూ ద్వారా 4 కేజీల గంజాయిని రూ.15 వేలకు తీసుకువచ్చాడు. డబ్బు ఆశతో గంజాయిని అమిత్ అనే వ్యక్తి విక్రయించి సొమ్ము చేసుకోవాలని చూశాడు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు ఆదివారం రాత్రి అతను ఉంటున్న ఇంటిపై దాడిచేసి, శుభ కంతజన వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న జిల్లూ, అమిత్‌లు కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాయదుర్గం, జూలై15 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో మోపెడ్‌పై టిఫిన్స్ విక్రయించే వక్తి మృతి చెందాడు. ఈ సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్ర కారం కాకినాడకు చెందిన సుబ్బారావు(38) ఏడాదిన్నర క్రితం బతుకుదెరువు కోసం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నగరానికి వచ్చి రాయదుర్గంలో ఉంటూ మోపెడ్‌పై తిరుగుతూ టిఫిన్స్ విక్రయిస్తూ జీవిస్తున్నాడు. కాగా రోజు మాదిగానే టిఫిన్స్ సిద్ధం చేసుకొని రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ ప్రాంతంలో విక్రయించేందుకు మోపెడ్‌పై ఉదయం 5.30 గంటల సమయంలో బయలుదేరాడు. బయోడైవర్సిటీ ఫ్లైఓవర్‌పై మలుపు వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం సుబ్బారావు మోపెడ్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో ఫ్లైఓవర్ పై నుంచి ఇంద రోడ్డుపై పడిపోయిన సుబ్బారావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఫారెస్ట్ కార్పొరేషన్ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఫారెస్ట్ కార్పొరేషన్ చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఉన్నతాధికారులు వివరించారు. నర్సరీల నిర్వహణ, బీడీ ఆకుకు సంబంధించిన వివరాలను చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫారెస్ట్ కార్పొరేషన్ ద్వారా అనేక పనులు చేపట్టాలని, వాటి వల్ల సమాజానికి మేలు కలిగేలా చూడాలని అధికారులను కోరారు. వివిధ పనులకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కాలానుగుణంగా ఈ ప్రణాళికలను అమలు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మొక్కల పెంపకాన్ని ఒక బాధ్యతగా స్వీకరించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.



మెడల్స్ సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

క్రీడాకారులకు సీఎం అభినందనలు

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్జాతీయ చాంపియన్‌షిప్‌లో మెడల్స్ సాధించిన క్రీడాకారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. క్రీడాకారులు సోమవారం ముఖ్యమంత్రిని కలిశారు. నేపాల్‌లో జరిగిన యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ఆరు బంగారు, రెండు రజిత పతకాలు సాధించారు. సాయిహన్సిక అండర్ - 17 ఎయిర్ రైఫిల్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్, సర్దార్ అంగద్ సింగ్ సిద్ధూ అండర్ - 17 ఎయిర్ రైఫిల్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. సురేందర్ అండర్ - 25 పిస్టల్ విభాగంలో గోల్డ్, రాథోడ్ సంతోష్ అండర్ - 30లో బ్రేక్ బారెల్ విభాగంలో గోల్డ్, సిల్వర్ మెడల్, బైరగోని అరుణ్‌కుమార్ ఓపెన్ క్యాటగిరి ఎయిర్ రైఫిల్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించారు.

ఆర్వో బ్రిడ్జిల దగ్గర నీరు నిలువకుండా చర్యలు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ఓవర్ బ్రిడ్జి, రోడ్డు అండర్ బ్రిడ్జిల దగ్గర నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనుంజయులుతో కలిసి వివిధ శాఖాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆర్వోబీ, ఆర్‌యూబీల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వీటి దగ్గర నీరు చేరే అవకాశం ఉందన్నారు.

ఘనంగా బండి రమేష్ జన్మదిన వేడుకలు



కేపీహెచ్‌బీకాలనీలో మొక్కలు నాటుతున్న రమేష్

కూకట్ పల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ జన్మదిన వేడుకలు సోమవారం కేపీహెచ్‌బీకాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ భారీ కేక్ కట్ చేయడంతో పాటు కేపీహెచ్‌బీకాలనీలో మొక్కలు నాటారు. అదేవిధంగా మూసాపేటలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నాయకుడు చున్ను పాషా, కేపీహెచ్‌బీకాలనీలో శివచౌదరి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, తూము వేణు, పుష్పారెడ్డి, లక్ష్మి, లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షులు, యువజన, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

వివేకానందనగర్‌కాలనీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్లకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మె ల్యే గాంధీ సమక్షం లో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు తన వెంట రావడం సంతోషకరంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో గౌతమ్ గౌడ్, జ్ఞానేశ్వర్, రోషన్, సలీమ్, రవి, సునీల్, అనిల్, రాజు, రోహిత్, సంజీవరెడ్డి, చంద్రకాంత్, మోజేష్, చిరుమర్తి రాజు, స్వరూప, పుష్ప, లక్ష్మి పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి : కార్పొరేటర్

షాపూర్‌నగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ పరిధిలోని సంజీవ్‌గాంధీ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను, కాలనీలు, బస్తీల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అవయవదాతకు వైద్యుల సెల్యూట్



అవయవదానం చేసిన యువకుడి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైద్యులు

దుండిగల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): వైద్య సేవలలో అవయవ దానం చాలా ముఖ్యమైనదని, వేలాది మంది రోగులు అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు అతని అవయవాలను దానం చేశారు. ఆస్పత్రిలో దాతకు వైద్యులు, సిబ్బంది సెల్యూట్ చేసి నివాళులర్పించారు. ఈ అవయవదానం ద్వారా, మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి తన మొదటి క్యాడర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. అతని అవయవాలను దానం చేయాలని కుటుంబసభ్యులు నిర్ణయించడం అసాధారణమైన విషయమని, వారి ధైర్యం, ఇతరులకి సాయం చేయాలనే గుణం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. అవయవదానం అవసరంలో ఉన్న చాలా మంది రోగులకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుందని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రీతిరెడ్డి పేర్కొన్నారు.



● రోడ్డు బాగు చేయరూ..!

రోడ్డుపైఅడుగు లోతుగుంత, ఆ గుంతల్లో చేరిన వర్షపు నీటిలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గాజులరామారం డివిజన్, దేవేందర్‌నగర్ కుత్బుల్లాపూర్ తహశీల్దార్ కార్యాలయం వద్ద నాలుగు నెలలు నుంచి రోడ్డు అధ్వానంగా ఉన్నా అధికారులు స్పందించడం లేదు. దివ్యాంగురాలు తన ద్విచక్ర వాహనంపై దేవేందర్‌నగర్ చౌరస్తా నుంచి మహాదేవపురం వెళ్తుండగా మండల కార్యాలయం దగ్గర రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో పడి గాయాలపాలైంది. రోడ్డు బాగుచేయాలని సానికులు ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

\- గాజులరామారం, (ఆంధ్రజ్యోతి)